క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: దేవరపల్లిలో కొత్తగా రెండో విద్యుత్ టౌన్ ఫీడర్ పనులు జరుగుతున్నందున మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. 11 కేవీ దేవరపల్లి ఇండస్ట్రియల్ ఫీడర్‌కు ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. 11 కేవీ అచ్చియపాలెం ఫీడర్‌లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

సమిశ్రగూడెం వంతెనపై ట్రాఫిక్ జామ్



సమిశ్రగూడెం వంతెనపై నిలిచిన వాహనాలు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం పశ్చిమ డెల్టా ప్రధాన కాలువపై ఉన్న వంతెన వద్ద సోమవారం మధ్యాహ్నం భారీ ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. వంతెనపై రెండు బస్సులతో పాటు కొన్ని వాహనాలు నిలిచిపోవడంతో నిడదవోలు, డి.ముప్పవరం వైపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలకు అనధికారికంగా పోలీసులు అనుమతులు ఇవ్వడంతో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు.

పీఆర్‌టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో పీఆర్‌టీయూ–2025 క్యాలెండర్, డైరీలను సోమవారం ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంఈఓ పి.గురుమూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్షులు చిర్రా గౌతం అశోక్‌బాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, రాష్ట్ర కౌన్సిలర్ సూర్యం, చెరుకు శ్రీనివాస్, సభ్యులు కేఎస్‌వీ రమేష్, మట్టా సత్యనారాయణ, జి.రవిశంకర్ పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

దేవరపల్లి: భారత మాజీ ప్రధాని, ఆర్థిక శాస్త్రవేత్త మన్మోహన్ సింగ్‌కు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం భారతరత్న ఇచ్చి గౌరవించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. మన్మోహన్‌సింగ్ సంతాప సభ సోమవారం దుద్దుకూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వెలగా రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి టీకే విశ్వేశ్వరరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కాకర్ల హరిబాబు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం.శారద, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

తాళ్లపూడి: మండలంలోని పలువురి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందింది. ఈ చెక్కులను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం పోచవరం, తాడిపూడి, వేగేశ్వరపురం, బల్లిపాడు, పెద్దేవం తదితర గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి అందజేశారు. లబ్ధిదారుల్లో దుగ్గిరాల సుబ్బారావు, గర్రే ఈశ్వరుడు, గంటా శివరామకృష్ణ, దూసనపూడి గణేశ్వరరావు, వల్లిపల్లి రవి, యండపల్లి రాజేశ్వరి, గరగ వీరవెంకటరావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, గౌరిజాల వెంకట ప్రసాద్ (జీవీ), కాకర్ల సత్యేంద్ర, అనపర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబాజీరావు బర్త్ డే



జన్మదిన కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాబాజీరావు. చిత్రంలో మాజీ మంత్రి తానేటి వనిత తదితరులు

దేవరపల్లి: గోపాలపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత జొన్నకూటి బాబాజీరావు జన్మదిన వేడుకలు యర్నగూడెంలోని ఆయన స్వగృహంలో సోమవారం ఘనంగా జరిగాయి. బాబాజీరావు కుమార్తె, మాజీ మంత్రి తానేటి వనిత, కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జొన్నకూటి సునీత, ఆశీర్వాదం దంపతులు, కుమారుడు విజయ్‌మోహన్‌కుమార్, కుటుంబ సభ్యుల సమక్షంలో బాబాజీరావు కేక్ కట్ చేశారు. పలువురు పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు బాబాజీరావుకు పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నేడే సందడి చేద్దాం



నిడదవోలులో పూల దుకాణం వద్ద విక్రయానికి సిద్ధమైన పుష్పగుచ్ఛాలు



బేకరీలో నోరూరిస్తున్న న్యూ ఇయర్ కేక్‌లు

- నూతన సంవత్సర వేడుకలకు చురుగ్గా ఏర్పాట్లు
- బేకరీలు, పూల దుకాణాలకు ఆర్డర్లు
- ఆఫర్లతో ఆకట్టుకుంటున్న హోటళ్లు

నిడదవోలు: శుభాలు కాంక్షిస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు అన్నివర్గాల వారూ సిద్ధమవుతున్నారు. నూతన సంవత్సర వేడుకలకు జోరుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే వాట్సాప్, ఫేస్‌బుక్, ఎస్సెమ్మెస్‌ల ద్వారా శుభాకాంక్షలు తెలుపుకునేందుకు యువత వివిధ డిజైన్లు రూపొందించే పనిలో నిమగ్నమైంది. వస్త్ర దుకాణాలు, బ్యాకరీలు, స్వీట్స్, పూలదుకాణాలు కళకళలాడుతున్నాయి. ఇంటి ముంగిట నూతన సంవత్సరానికి స్వాగత అక్షరాలు, రంగవల్లులు తీర్చిదిద్దేందుకు అతివలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందుకోసం మహిళలు, యువతులు మార్కెట్లో విక్రయిస్తున్న రంగులను కొనుగోలు చేస్తున్నారు. కోటి ఆశలతో కొత్త ఏడాదిని స్వాగతించేందుకు కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా ప్రజలు సన్నద్ధం అవుతున్నారు. పట్టణంలోని మంత్రి కందుల దుర్గేష్ క్యాంపు కార్యాలయంలో భారీ టెంట్లు వేసే పనులు సాగుతున్నాయి. పట్టణంలోని ఏ సెంటర్‌లో చూసినా వివిధ వర్గాల వారు తమ స్థోమతను బట్టి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులకు నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ భారీ ఎత్తున కటౌట్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఫ్లెక్సీల తయారీదారులకు ఆర్డర్లు పెరిగాయి. పందిళ్లలో మైక్ సిస్టమ్ ఏర్పాటు చేసుకుని యువత వేడుకలకు సిద్ధమవుతోంది.

హోటళ్లలో ప్రత్యేక ఆఫర్లు

నిడదవోలులోని స్వీట్ స్టాల్స్, పూల దుకాణాల నిర్వాహకులు ఆర్డర్లను బట్టి రకరకాల స్వీట్లు, పుష్పగుచ్ఛాలు, పూలమాలలు తయారు చేస్తున్నారు. పట్టణంలో 20 వరకూ బిర్యానీ సెంటర్లు ఉన్నాయి. వాటికి అదనంగా 31వ తేదీ రాత్రికి ప్రత్యేక దుకాణాల ద్వారా పలావ్, వివిధ రకాల మాంసాహార వంటకాలు తయారీ, విక్రయాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వినియోగదారులను ఆకర్షించేందుకు పలు హోటళ్ల వారు ప్రత్యేక వంటకాలు, ఆఫర్లతో ప్రచారం మొదలెట్టారు. నూతన సంవత్సర వేడుకల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు నియోజవర్గంలోని వివిధ చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కొత్త సంవత్సరంలోకి ప్రవేశించే ముందు క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయడం ఆనవాయితీ. బేకరీలకు కొత్త సంవత్సర కేక్‌ల ఆర్డర్లు భారీ ఎత్తున సాగుతున్నాయి. వివిధ బేకరీలకు కూల్ కేక్‌లు, సాధారణ కేక్‌ల ఆర్డర్లు ఇప్పటికే భారీగా వస్తున్నాయి. సాధారణ కేక్ కేజీ రూ.300 నుంచి రూ.400 , కూల్ కేక్ కేజీ రూ.600 నుంచి రూ.700 రేటుకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. మొత్తంగా న్యూఇయర్ పేరిట రూ.లక్షల్లో వ్యాపార లావాదేవీలు జరుగుతాయి.

30 శాతం పెరిగిన పూల ధరలు

నూతన సంవత్సర వేడుకల్లో పూలబొకేలు, పూలమాలలకు ప్రాధాన్యం ఎక్కువ. రాజకీయ ప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖులకు పూలబొకేలు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పడం సర్వసాధారణం. ఈ క్రమంలో పూలబొకేల తయారీలో కార్మికులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే వేలాది బొకేలు, పూలదండలు తయారు చేసి సిద్ధంగా ఉంచారు. బెంగళూరు నుంచి తెప్పించిన పూలతో తయారు చేసిన బొకేలు ఆకట్టుకుంటున్నాయి. గతేడాదితో పోలిస్తే పూల ధరలు 30 శాతం పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. అయినా మంచి గిరాకీ ఉండడంతో లాభాలు వస్తాయన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. సాధారణ సైజు బంతిపూల దండ రూ.100 నుంచి రూ.150 రేటు పలుకుతోంది. చామంతి పూలదండ రూ.250 నుంచి రూ.300, చామంతులు కేజీ రూ.200 నుంచి రూ.300, కనకాంబరాలు మూర రూ.100, జాజులు మూర రూ.100, కాడమల్లె రూ.50, గులాబీలు రూ.300 రేటుకు పూల వ్యాపారులు విక్రయిస్తున్నారు.



పూలదండలు తయారు చేస్తున్న కార్మికులు



ఇంటి ముంగిట ముగ్గులు వేయడానికి మార్కెట్లో విక్రయిస్తున్న రంగులు

లారీని ఢీ కొట్టిన ట్రావెల్స్ బస్సు



దెబ్బతిన్న బస్సు ముందు భాగం

దేవరపల్లి: విశాఖ నుంచి గుంటూరు వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు జాతీయ రహదారిపై దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద సోమవారం తెల్లవారుజాము నాలుగు గంటలకు ప్రమాదానికి గురైంది. ముందు వెళుతున్న లారీని ఈ బస్సు ఢీ కొట్టింది. దాంతో బస్సు ముందుభాగం దెబ్బతింది. అయితే బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. బస్సులో 47 మంది ప్రయాణికులు ఉన్నట్టు ఎస్సై వి. సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నం



ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్సై సతీష్‌కుమార్

గోపాలపురం: స్థానిక ఎస్‌బీఐ ఏటీఎంలో గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో చోరీకి యత్నించారు. వారు ఏటీఎంలోకి పెద్దరాయి తీసుకెళ్లి చోరీ ప్రయత్నం చేశారని గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఇంతలో ఒక్కసారిగా బ్యాంకులో ఉన్న సైరన్ మోగడంతో దుండగులు పరారైనట్టు ఎస్సై తెలిపారు. బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

శతాధిక వృద్ధుడి మృతి



వంగ నారాయణ స్వామి

నల్లజర్ల: ఆవపాడుకు చెందిన శతాధిక వృద్ధుడు, రిటైర్డు పోస్టుమేన్ వంగ నారాయణస్వామి (100) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. చనిపోయే వరకూ ఆయన తన పనులు తానే చేసుకునేవారు. 30 ఏళ్లపాటు ప్రకాశరావుపాలెం పోస్టుమేన్‌గా పని చేశారు. ఆ తర్వాత కమ్యూనిస్టు ఉద్యమ నేత కాకర్ల ప్రకాశంతో కలసి ఆ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. వివిధ గ్రామాల్లో భజన బృందాలను తయారు చేసి హార్మోనిస్టుగా పనిచేసేవారు. ఆవపాడు సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీరావు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు షేక్ మీరా సాహెబ్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటస్వామి, మద్దూరి నాగేశ్వరరావు, విష్ణు, నాగు తదితరులు నారాయణ స్వామి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బీజేపీ మండలశాఖ అధ్యక్షుడిగా వరప్రసాద్



వరప్రసాద్

చాగల్లు: భారతీయ జనతా పార్టీ చాగల్లు మండల శాఖ నూతన అధ్యక్షుడిగా తాళ్లూరి వరప్రసాద్ ఎన్నికయ్యారు. చాగల్లులో సోమవారం నిర్వహించిన ఆ పార్టీ మండల స్థాయి సమావేశంలో అధ్యక్షుడిగా వరప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్టు ఆ పార్టీ జిల్లా నాయకులు కరుటూరి జగదీశ్వరరావు, బి.ముత్యాలరావు, కంచుమర్తి సుబ్బారావు తెలిపారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

చాగల్లు: స్థానికంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం మూడు జట్ల మధ్య హోరాహోరీగా పోటీలు జరిగాయి. మూడు రోజులుగా ఉత్సాహంగా జరుగుతున్న ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు క్రీడాకారులు పాల్గొంటున్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలంటూ ధర్నా



కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కొవ్వూరు: వామ పక్ష ప్రజాతంత్ర శక్తుల దేశవ్యాప్త నిరసనలో భాగంగా సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రజాతంత్ర శక్తుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈ ధర్నా నిర్వహించామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు ఈమని మల్లిక ప్రకటించారు. అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తక్షణం బర్తరఫ్ చేయాలంటూ వారు నినాదాలు చేశారు. జానిపల్లి సత్తిబాబు, కె.జోజి, పల్లా వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా అభ్యుదయ పెయింటర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో పట్టణంలోని ఇందిరానగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు రవ్వ సురేష్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయకార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలు దేశద్రోహమన్నారు. ఆయనను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పురుగు చైతన్య, యలగాడ రాజ్‌పాల్, బాలు, నందిగోళ్ల మహేష్, విశ్వాస్, రాధాకృష్ణ, బవిరిశెట్టి నాగేంద్ర, రాజీవ్, అశోక్, పాలంగి చంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎగ్జిబిషన్ గ్రౌండులో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. దివ్యాంగుల ఆటల పోటీల్లో విజేతలకు మంత్రి దుర్గేష్ బహుమతులు అందజేశారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన నాలుగు ట్రై సైకిళ్లను దివ్యాంగులకు అందజేశారు. అనంతరం మంత్రి దుర్గేష్‌ను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, దివ్యాంగుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అల్లాడి నటరాజు, నిడదవోలు జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు ర్యాలి సత్యనారాయణ(శివ), మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడిన ఐదుగురి అరెస్ట్

ఐదు బైక్‌ల స్వాధీనం

కొవ్వూరు: డిసెంబర్‌లో కొవ్వూరులో నాలుగు మోటారు సైకిళ్లు, సెప్టెంబర్ 15న రావులపాలెం మండలం ఈతకోటలో మరో బైక్ చోరీకి పాల్పడిన ఐదుగురు సభ్యుల ముఠాను సోమవారం అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. స్థానిక కాటన్ విగ్రహం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నపుడు మోటార్ సైకిళ్లు వేసుకుని వస్తూ నిందితులు రికార్డులు లేకుండా పట్టుబడ్డారన్నారు. ఆరాతీస్తే వారి చోరీల చిట్టా బయట పడినట్టు సీఐ తెలిపారు. రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ ప్రాంతానికి చెందిన దడాల సాయితేజ, సోమాలమ్మ గుడి వీధికి చెందిన శీలం వీరవెంకట సత్యనారాయణ, ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం కన్నాపురానికి చెందిన చెన్నూరి పవన్, అదే మండలం చొప్పరామన్నగూడేనికి చెందిన గానుబోయిన సాయిసుబ్రహ్మణ్యం, కామవరపుకోట మండలం తడికలపూడికి చెందిన ఇందుగుల చరణ్‌తేజ అనే ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి ఐదు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఈతకోటలో మోటారు సైకిల్‌తో పాటు 4.300 గ్రాముల బంగారు ఆభరణాలను కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కొవ్వూరు పట్టణంలో ఈనెల 15,19, 21, 25 తేదీల్లో నిందితులు వరుసగా నాలుగు మోటారు సైకిళ్లను దొంగతనం చేసినట్టు సీఐ తెలిపారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరు పరచనున్నట్టు ఆయన తెలిపారు.

భూ సర్వేపై గ్రామాల్లో అవగాహన ర్యాలీలు



చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో భూ సర్వే అవగాహన ర్యాలీ

నల్లజర్ల: భూముల సమగ్ర రీ సర్వే జనవరి 5 నుంచి తిరిగి ప్రారంభం కానున్నట్టు ఇన్‌చార్జ్ తహసీల్దారు ఎస్‌వీకే నాయుడు తెలిపారు. అనంతపల్లి–2 సచివాలయంలో సోమవారం వీరవల్లి రైతులతో ఆయన సమావేశమయ్యారు.

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో సోమవారం తహసీల్దార్ ఎం.మెరికమ్మ ఆధ్వర్యంలో భూ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది పొలాల్లో రీసర్వే చేసేటపుడు రైతులు, భూ యాజమానులు వారికి సహకరించాలన్నారు. భూ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎస్.కమల్‌సుందర్ భూ సర్వే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆర్ఐ ఎస్కే కమల్, మండల సర్వే అధికారి గోపాలకృష్ణ, వీఆర్వో రామకృష్ణ పాల్గొన్నారు.

పైలట్ ప్రాజెక్టుగా సత్యవాడ

ఉండ్రాజవరం: రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఏపీ ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా మండలంలోని సత్యవాడ గ్రామాన్ని ఎంచుకున్నట్టు డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ తెలిపారు. భూ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా సత్యవాడ గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కనకదుర్గ మాట్లాడుతూ జనవరి 2న గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహిస్తామన్నారు. రీసర్వే నిమిత్తం మండలంలో గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలను ఆరు టీములుగా విభజించామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జి.శ్రీనివాసరావు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎం.హరిప్రసాద్, కార్యదర్శి జి.ప్రసాదరావు పాల్గొన్నారు

పెరవలి: భూముల రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పిస్తూ తహసీల్దార్ డి.అచ్యుతకుమారి ఆధ్వర్యంలో ఖండవల్లి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం గ్రామస్తులు, అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు అధికారులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి పంచాయతీ పరిధిలోని కుకునూరు, వీరభద్రపురం గ్రామాల్లో సోమవారం 4వ విడత భూముల రీ సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు రైతులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ మోహన భారతి మాట్లాడుతూ కుకునూరు రెవెన్యూ గ్రామాన్ని ఫోర్త్ ఫేజ్‌లో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. జరిగిందన్నారు. మార్చి నెల వరకు గ్రామంలో రీ సర్వే జరుగుతుందన్నారు. మండల సర్వేయర్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంపై శిక్షణ, ఉపాధి

కొవ్వూరు: పురపాలక సంఘ పరిధిలో వివిధ రకాల వృత్తులు నిర్వహించుకునే వారికి నైపుణాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ అందించి జీవనోపాధికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ టి.నాగేంద్రకుమార్ సోమవారం చెప్పారు. పట్టణంలో ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, ప్లంబర్‌లు, ఏసీ, గీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్ మెకానిక్‌లకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ప్రత్యేక శిక్షణ అందించి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అర్హత కలిగిన వారు తమ కాళ్ల మీద తాము నిలబడేలా జీవనోపాధి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు జనవరి 3న కొవ్వూరు మెప్మా విభాగంలో తమ వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. రేషన్, ఆధార్ కార్డులు, బ్యాంకు పాసు పుస్తకం, పాన్ కార్డు జిరాక్సులతో పాటు భార్య పేరు, సంఘం పేరు,కోడ్ వివరాలు అందజేయాలని సూచించారు.

బాలిక కుటుంబానికి రక్షణ కల్పించాలి

కొవ్వూరు: బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన పాస్టర్ కుటుంబ సభ్యులు బాధిత బాలిక కుటుంబంపై దాడికి పాల్పడుతున్నారని ధన్వంతరి నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ అన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆ కుటుంబంపై దాడికి పాల్పడే అవకాశం ఉన్నందున రక్షణ కల్పించాలన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణ పోలీసులకు, జిల్లా ఎస్పీకి తాము వినతిపత్రాలు అందజేశామన్నారు. రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు చిట్టాబత్తుల నాగబాబు, జిల్లా అధ్యక్షుడు మేడూరి వీర్రాజు, నాయకులు తణుకు సూర్య, రాజమహేంద్రవరం గౌరవాధ్యక్షుడు నందనాపల్లి సత్యనారాయణ, అధ్యక్షుడు కందికొండ అనంత తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్ హ్యాండ్‌బాల్ జట్టుకు కాంస్య పతకం

కొవ్వూరు: ఈనెల 26 నుంచి 29 వరకూ కేరళలో నిర్వహించిన జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఇండియన్ రైల్వేస్ జట్టు తృతీయస్థానం సాధించింది. కొవ్వూరుకు చెందిన మద్దుకూరి సుధాకర్ భారతీయ రైల్వేస్ పురుషుల, మహిళల హ్యాండ్‌బాల్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. కేరళలోని ఎస్‌బీ కాలేజ్ స్టేడియం, చెంగనాచేరి, కొట్టాయంలో ఈ పోటీలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. జట్టుకు క్యాంస పతకం లభించడంతో పాటు కోచ్‌గా వ్యవహరించిన తనకు మెడల్, ప్రశాంస పత్రం అందజేసి నట్లు సుధాకర్ తెలిపారు.

ఆర్వో ప్లాంట్ మొరాయిస్తే పట్టించుకోరా?

- అధికారులను నిలదీసిన ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్
- వాడీవేడిగా పెరవలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో ఎంపీడీవో వెంకటరమణను నిలదీస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

పెరవలి: ఆర్వో ప్లాంట్ పనిచేయక, నెల రోజులుగా అన్నవరప్పాడులో తాగునీటి సమస్య ఉన్నా ఎందుకు స్పందించడం లేదని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ పెరవలి ఎంపీడీఓ సీహెచ్ వెంకటరమణను నిలదీశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షతన సోమవారం జరిగింది. సభ్యుల అరుపులు, కేకలు, భావోద్వేగాల మధ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఆర్వో ప్లాంట్ అంశంపై అన్నవరప్పాడు సర్పంచ్ పంతం బాల సుందరి మాట్లాడుతూ అధికారులకు ఆర్వో ప్లాంట్ తాళం ఇచ్చి ఎనిమిది రోజులైనా మరమ్మతులు మొదలు పెట్టలేదన్నారు. ఈ దశలో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ మరోసారి కలగజేసుకుని 'మీరు చేసిన తప్పుల మూలంగా మంత్రి గారికి చెడ్డ పేరు వస్తోంది. వెంటనే పనులు పెడితే ఎప్పటికి మరమ్మతులు పూర్తవుతాయి' అని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్‌ను ప్రశ్నించారు. జనవరి 1 నాటికి ఆర్వో ప్లాంట్ మరమ్మతులు పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ అంశంపై సమావేశంలో సుమారు గంట పాటు చర్చ సాగింది.

పోలీసులకు చెప్పి రక్షణ కల్పించండి

ముక్కామల హెల్త్ సెంటర్‌లో విధులకు ఎంఎల్‌హెచ్‌పీ హాజరు కావడం లేదని సర్పంచ్ కేతా త్రిమూర్తులు సమావేశం దృష్టికి తెచ్చారు. అదే గ్రామానికి చెందిన ఒకరు ఇబ్బందులు పెడుతున్నందునే ఆమె విధులకు హాజరు కావడం లేదని వైద్యాధికారి విజయకుమార్ బదులిచ్చారు. దీనిపై ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ స్పందిస్తూ ఈ సమస్య పోలీసులకు తెలిపి ఆమెకు రక్షణ కల్పించాలని ఆదేశించారు. లంకమాలపల్లిలో ఇంటింటికీ రేషన్ ఇవ్వడం లేదని, డీలర్ ఇంటికి వెళ్లి తెచ్చుకోవలసి వస్తోందని ఫిర్యాదు చేశారు. తల్లికి వందనం సాయం అందాలంటే విద్యార్థులకు విధిగా 75 శాతం హాజరు ఉండాలని ఎంఈఓ స్వరూప్ తెలిపారు. ఖండవల్లి సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించలేదని ఎంపీటీసీ సభ్యుడు పల్లేటి రవి ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరల పెంపకం అంశంపై చర్చ జరిగినపుడు కానూరు అగ్రహారం ఎంపీటీసీ సభ్యుడు హరిదాసు సుబ్బారావు ప్రశ్నకు సీడీపీఓ శ్రీలక్ష్మి సమాధానం చెప్పే క్రమంలో కొంత పరుషంగా స్పందించారు. దానికి ఆగ్రహించిన ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ 'సమాధానం చెప్పకపోతే వెళ్లిపోండి. అంతేకాని ఈ విధంగా సభ్యులపై ఆగ్రహించడం తగదని హెచ్చరించారు. ముక్కాల సర్పంచ్ కేతా త్రిమూర్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో బెల్ట్ షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. నియంత్రణకు ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. కొన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. వారికి నోటీసులు ఇవ్వాలని ఎంపీపీ ఆదేశించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com